

ఘనంగా హుసేనీ ఉరుసు

బొమ్మనహాళ్ మండలం దర్గాహొన్నూరులో పర్మస్ హుసేనీ ఉరుసు శనివారం ఘనంగా జరిగింది.

8లో



టమాట కిలో రూ.20

కక్కలపల్లి మండీలో శనివారం కిలో టమాట గరిష్ట ధర రూ.20 పలికింది. కనిష్టం రూ.10, సరాసరి రూ.14 ప్రకారం క్రయ విక్రయాలు జరిగాయి.

గరిష్టం/కనిష్టం
33.5°/ 18.6°

జిల్లా అంతటా శనివారం పగలు, రాత్రి ఉష్ణోగ్రతలు తగ్గాయి. అల్పపీడనం నేపథ్యంలో ఆకాశం మేఘావృతమై అక్కడక్కడా తేలికపాటి వర్షం కురిసింది. ఉదయం చలి కొనసాగింది.

న్యూస్‌రీల్

శాంతిభద్రతలకు విఘాతం కల్గిస్తే తాటతీస్తా



యల్లనూరు స్టేషన్ వద్ద మాట్లాడుతున్న ఎస్పీ అన్బురాజన్

యల్లనూరు/ పుట్లూరు: శాంతిభద్రతలకు విఘాతం కలిగిస్తే తాట తీస్తామని ఎస్పీ కేకేఎన్ అన్బురాజన్ హెచ్చరించారు. శనివారం యల్లనూరు, పుట్లూరు పోలీస్‌స్టేషన్లను ఎస్పీ తనిఖీ చేశారు. పెండింగ్ రికార్డులు, రిసెప్షన్, లాకప్ గదులను పరిశీలించారు. అనంతరం సిబ్బందిని ఉద్దేశించి ఎస్పీ మాట్లాడుతూ సమస్యాత్మక, ఫ్యాక్షన్ ప్రభావిత గ్రామాలతో పాటు రౌడీషీటర్లపై ప్రత్యేక నిఘా పెంచాలని, చోరీలు జరగకుండా ప్రజలను అప్రమత్తం చేయాలని సూచించారు. పెండింగ్ కేసులు త్వరగా పూర్తి చేయాలన్నారు. మహిళా సమస్యల పరిష్కారానికి ప్రాధాన్యత ఇవ్వాలన్నారు. ఇసుక, మట్కా, క్రికెట్ బెట్టింగ్, పేకాట, గంజాయి, నాటుసారా తదితర చట్ట వ్యతిరేక కార్యకలాపాలను నియంత్రించాలని ఆదేశించారు. పుట్లూరు స్టేషన్‌కు త్వరలోనే ఎస్‌ఐని నియమిస్తామని ఎస్పీ తెలిపారు. కార్యక్రమంలో డీఎస్పీ వెంకటశివారెడ్డి, సీఐ సుబ్రమణ్యం, ఎస్‌ఐ దిలీప్‌కుమార్ పాల్గొన్నారు.

డెయిరీల్లో తనిఖీలు



పాల నాణ్యత పరిశీలిస్తున్న అధికారులు

అనంతపురం క్రైం: విజిలెన్స్, ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు శనివారం జిల్లాలోని పలు పాల డెయిరీల్లో తనిఖీలు చేపట్టారు. అనంతపురంలోని గాయత్రి మిల్క్ డెయిరీ, పరాగ్ మిల్క్ డెయిరీ, హెరిటేజ్ మిల్క్ డెయిరీ, రూరల్ మండలం మన్నీల వద్ద ఉన్న సంఘం మిల్క్ ప్రొడ్యూసర్ కంపెనీ లిమిటెడ్, అదే విధంగా కూడేరు మండలం ముద్దలాపురం వద్ద దొడ్ల డెయిరీలో పాల ఉత్పత్తులు, రికార్డులు పరిశీలించినట్లు విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఎస్పీ మునిరామయ్య తెలిపారు. నాణ్యత పరీక్షల నిమిత్తం నమూనాలను సేకరించి ల్యాబ్‌కు పంపినట్లు ఆయన చెప్పారు.

పలు రైళ్లు రద్దు



గుంతకల్లు: మిచాంగ్ తుపాను కారణంగా గుంతకల్లు డివిజన్ మీదుగా నడుస్తున్న పలు ఎక్స్‌ప్రెస్ రైళ్లను రద్దు చేసినట్లు సీనియర్ డీసీఎం మనోజ్ తెలిపారు. రద్దు చేసిన ఎక్స్‌ప్రెస్ రైళ్ల వివరాలను శనివారం మీడియాకు వెల్లడించారు. 3, 4, 5 తేదీల్లో తిరుపతి-లింగంపల్లి (12733), 4, 5, 6 తేదీల్లో లింగంపల్లి - తిరుపతి (12734), 3, 4 తేదీల్లో తిరుపతి-సికింద్రాబాద్ (12763), 5, 6 తేదీల్లో సికింద్రాబాద్-తిరుపతి (12764), 3, 4, 5 తేదీల్లో నర్సాపూర్-ధర్మవరం ఎక్స్‌ప్రెస్ (17247), 4, 5, 6 తేదీల్లో ధర్మవరం-నర్సాపూర్ (17248) ఎక్స్‌ప్రెస్ రైళ్లు రద్దు చేసినట్లు వివరించారు. 5వ తేదీన తిరుపతి-అదిలాబాద్-తిరుపతి (17405/06) ఎక్స్‌ప్రెస్ రైళ్లు రద్దు చేసినట్లు పేర్కొన్నారు. 3, 4, 5 తేదీల్లో విశాఖపట్నం-కడప (17488) రైళ్లు, 4, 5, 6 తేదీల్లో కడప-విశాఖపట్నం (17487) రైలు, 3, 4 తేదీల్లో సికింద్రాబాద్-తిరుపతి-సికింద్రాబాద్ (20701/02) ఎక్స్‌ప్రెస్ రైళ్లను రద్దు చేసినట్లు వివరించారు. ప్రయాణికులు సహకరించాలని విజ్ఞప్తి చేశారు.



రాప్తాడులో సామాజిక సాధికార యాత్ర ఏర్పాట్లపై చర్చిస్తున్న జిల్లా ఇన్‌చార్జ్ మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, ఎంపీ మాధవ్, ఎమ్మెల్యేలు తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి, శంకరనారాయణ, జెడ్పీ చైర్‌పర్సన్ గిరిజమ్మ



రాయదుర్గంలో సభా స్థలాన్ని పరిశీలిస్తున్న మంత్రులు పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, ఉషశ్రీచరణ్, చిత్రంలో విప్ కాపు రామచంద్రారెడ్డి, ఎంపీ, రంగయ్య, మెట్టు గోవిందరెడ్డి తదితరులు

జగన్ పాలనలోనే... సామాజిక న్యాయం

- అభివృద్ధి, సంక్షేమం తెలిపేందుకే సామాజిక సాధికార బస్సు యాత్ర
- రాప్తాడులో ఈ నెల 4న సాధికారత సభ
- జిల్లా ఇన్‌చార్జ్ మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, రాప్తాడు ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి

రాప్తాడు: జగన్ పాలనలోనే ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీలకు సామాజిక న్యాయం జరుగుతోందని జిల్లా ఇన్‌చార్జ్ మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, రాప్తాడు ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి అన్నారు. ఈ నెల 4న రాప్తాడులో జరిగే సామాజిక సాధికార బస్సు యాత్ర సందర్భంగా ఏర్పాటు చేసే బహిరంగ సభ స్థలాన్ని వారు శనివారం పరిశీలించారు. ఈ సందర్భంగా మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి మాట్లాడుతూ సామాజిక సాధికార బస్సు యాత్రను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. సీఎం జగన్ మోహన్ రెడ్డితోనే అన్ని వర్గాల ప్రజలకూ సామాజిక, ఆర్థిక న్యాయం చేకూరిందన్నారు. రాబోవు ఎన్నికల్లో 175 అసెంబ్లీ స్థానాల్లోనూ గెలిపించే బాధ్యత ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీలందరూ తీసుకోవాలన్నారు. చంద్రబాబు ప్రజాధనం లూటీ చేశారు కాబట్టే జైలు జీవితం అనుభవిస్తున్నారన్నారు. తప్పు చేసిన వారు ఎంతటి వారైనా శిక్ష తప్పదన్నారు. ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి మాట్లాడుతూ అన్ని వర్గాలకు అధికారం అందాలన్నదే సీఎం వైఎస్ జగన్ లక్ష్యమన్నారు. అందువల్లే 25 మంది ఉన్న మంత్రి వర్గంలో 17 మంది ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీలకు చోటు కల్పించారన్నారు. ఎస్సీ మహిళను రాష్ట్ర హోం మంత్రిగా చేసిన ఏకైక ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మాత్రమేనన్నారు. కార్యక్రమంలో హిందూపురం ఎంపీ గోరంట్ల మాధవ్, జిల్లా పరిషత్ చైర్మన్ బోయ గిరిజమ్మ, ఎమ్మెల్సీ మంగమ్మ, వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు పైలా నరసింహయ్య, అహుడా చైర్మన్ మహాలక్ష్మి శ్రీనివాస్, ఎమ్మెల్యేలు మాలగుండ్ల శంకర నారాయణ, సిద్దారెడ్డి, ఉర్దూ అకాడమీ చైర్మన్ నదీమ్ అహమ్మద్, రజక కార్పొరేషన్ చైర్మన్ మీసాల రంగన్న, డీసీసీబీ మాజీ చైర్మన్ పామిడి వీరాంజనేయులు, వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకులు తోపుదుర్తి చంద్రశేఖర్‌రెడ్డి, వైస్ ఎంపీపీ బోయ రామాంజినేయులు, బీసీ సెల్ నాయకులు చిట్రా వెంకటేష్, పసుపుల ఆది, మండల ఎన్నికల ఇన్‌చార్జ్ చిట్రెడ్డి సత్యనారాయణరెడ్డి, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ జూటూరు శేఖర్, వైఎస్సార్ హార్టికల్చర్ వర్సిటీ బోర్డు సభ్యుడు ఆగ్రోస్ కేశవరెడ్డి పాల్గొన్నారు.

రాయదుర్గంలో 5న బస్సు యాత్ర

రాయదుర్గం: వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ వర్గాలకు అగ్రపీఠం దక్కిందని మంత్రులు పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, ఉషశ్రీ చరణ్, ప్రభుత్వ విప్ కాపు రామచంద్రారెడ్డి తెలిపారు. గడిచిన నాలుగున్నరేళ్లలో జరిగిన సామాజిక విప్లవం, గడప గడపకూ చేరిన అభివృద్ధి, సంక్షేమం గురించి ప్రజలకు తెలియజేసేందుకు ఈ నెల ఐదో తేదీన రాయదుర్గంలో సామాజిక సాధికార బస్సు యాత్ర నిర్వహించనున్నట్లు వెల్లడించారు. శనివారం వారు బస్సు యాత్ర రూట్‌మ్యాప్, తేరుబజారులో బహిరంగ సభ స్థలం వద్ద చేపట్టాల్సిన ఏర్పాట్లపై చర్చించారు. మంత్రి పెద్దిరెడ్డి మాట్లాడుతూ అంబేడ్కర్, జ్యోతిరావుపూలే వంటి మహనీయుల ఆశయ సాధన దిశగా సీఎం జగన్ పయనిస్తున్నారన్నారు. రాష్ట్రంలో ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ వర్గాల ప్రజలకు సంక్షేమ పథకాల నుండి పదవుల వరకు సామాజిక విప్లవం కొనసాగిస్తూ అన్నింటా అగ్రతాంబూలం అందించారని గుర్తుచేశారు. ఆ వర్గాలన్నీ 2024లో వైఎస్సార్‌సీపీని అధికారంలోకి తేవడంలో కీలక భాగస్వాములుగా నిలవాలని కోరారు. బస్సు యాత్రను విజయవంతం చేయాలని ప్రభుత్వ విప్ కాపు రామచంద్రారెడ్డి పిలుపునిచ్చారు. మంత్రుల వెంట ఎంపీ రంగయ్య, ఏపీఐఐసీ చైర్మన్ మెట్టు గోవిందరెడ్డి, జెడ్పీ చైర్‌పర్సన్ బోయ గిరిజమ్మ, వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు పైలా నరసింహయ్య, మున్సిపల్ చైర్‌పర్సన్ పొరాళ్ల శిల్ప, వైఎస్సార్‌సీపీ రైతు విభాగం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గౌని ఉపేంద్రారెడ్డి, అహుడా చైర్మన్ మహాలక్ష్మి శ్రీనివాస్, ఏడీసీసీబీ మాజీ చైర్మన్ పామిడి వీరాంజినేయులు, ఏపీ హౌసింగ్ కార్పొరేషన్ డైరెక్టర్ శ్రీనివాసులు, మున్సిపల్ వైస్ చైర్మన్లు శ్రీనివాస్‌యాదవ్, వలిబాషా, ఎస్సీ సెల్ రాష్ట్ర కార్యదర్శి బీటీపీ గోవిందు, జిల్లా ఉపాధ్యక్షులు రాళ్ల తిమ్మారెడ్డి, పట్టణ, మండల కన్వీనర్లు అరవ శివప్ప, ఎం.వన్నూర్‌స్వామి, గౌని కాంతారెడ్డి, మేకల శ్రీనివాసులు, క్లాస్-1 కాంట్రాక్టర్లు గౌని సత్యనారాయణరెడ్డి, ఆర్టీ కాంతారెడ్డి పాల్గొన్నారు.

ప్రజలదే రాజ్యాధికారం

- ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి
- దొంగ ఓట్లు చేర్పించేందుకు సునీత పాట్లు పడుతోందని ధ్వజం

అనంతపురం టవర్‌క్లాక్: వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో ప్రజలదే రాజ్యాధికారమని రాప్తాడు ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి అన్నారు. రాప్తాడులో ఈ నెల 4న నిర్వహించే సామాజిక సాధికార బస్సు యాత్రను విజయవంతం చేయాలని ఆయన కోరారు. శనివారం అనంతపురంలోని ఆర్‌అండ్‌బీ అతిథి గృహంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఎమ్మెల్యే మాట్లాడుతూ సామాజిక సాధికార బస్సు యాత్ర సోమవారం రాప్తాడుకు చేరుకుంటుందన్నారు. మధ్యాహ్నం 3 గంటలకు నిర్వహించే బహిరంగ సభలో మంత్రులు, ఎమ్మెల్యేలు ప్రసంగిస్తారన్నారు. బీసీలు, ఎస్సీలు, ఎస్టీలు, మైనార్టీలు పెద్ద ఎత్తున హాజరు కావాలన్నారు. వైఎస్సార్‌సీపీ అధికారంలోకి వచ్చాక వివిధ సంక్షేమ పథకాలతో రాప్తాడు నియోజకవర్గంలో రూ.2,500 కోట్ల మేర ప్రజలకు లబ్ధి చేకూరిందన్నారు. ఇందులో బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీలే ఎక్కువ శాతం ఉన్నారన్నారు. సామాజికంగా, ఆర్థికంగా, రాజకీయంగానూ ఆయా వర్గాలకు పెద్దపీట వేసిందన్నారు. రాష్ట్రంలో అన్ని వర్గాలకు రాజ్యాధికారంలో భాగస్వామ్యం కల్పించి, న్యాయం చేసిన ఘనత వైఎస్ జగన్‌కే దక్కుతుందన్నారు.

మాయమాటలు చెప్తారు జాగ్రత్త!

తెలుగుదేశం మాజీ మంత్రి పరిటాల సునీత నాలుగేళ్లు నిద్రావస్థలో ఉండి.. ఎన్నికలు సమీపిస్తున్న సమయంలో మెలకువలోకి వచ్చారని ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి ఎద్దేవా చేశారు. ఓట్ల కోసం మాయమాటలు చెబుతారని.. మోసపోకుండా ప్రజలు జాగ్రత్తగా ఉండాలని సూచించారు. టీడీపీ హయాంలో ఫ్యాక్షన్, రౌడీయిజం, దౌర్జన్యం పేట్రేగిపోయాయని, నియోజకవర్గ అభివృద్ధిని, ప్రజల సంక్షేమాన్ని గాలికొదిలేశారని గుర్తు చేశారు. అటువంటి వారు తనపై తప్పుడు ప్రచారం చేస్తున్నారని విరుచుకుపడ్డారు. తాను కమీషన్లకు గాని, రక్తపు మరకలతో సంపాదించే సొమ్ముకు గాని ఏనాడూ ఆశపడబోనని తేల్చి చెప్పారు. పరిటాల సునీత మంత్రిగా ఉన్నపుడు పేరూరు డ్యాంకు నీరు తెస్తామని హామీ ఇచ్చి నెరవేర్చలేకపోయారన్నారు. వైఎస్సార్‌సీపీ అధికారంలోకి వచ్చాక తాను పేరూరు డ్యాంకు నీరు తీసుకొచ్చేందుకు కృషి చేస్తుంటే కర్ణాటక రాష్ట్రం పావగడ ఎమ్మెల్యే ద్వారా అడ్డుకున్నారని తెలిపారు. అయినా తాము కర్ణాటక సీఎంతో చర్చలు జరిపి పేరూరు డ్యాంకు నీరు తీసుకొచ్చామని చెప్పారు.



మాట్లాడుతున్న ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి

ఓట్ల తొలగింపునకు సునీత కుట్ర

రాప్తాడు నియోజకవర్గంలో 50 వేల ఓట్లు తొలగించేందుకు పరిటాల సునీత కుట్ర పన్నిందని తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి విమర్శించారు. తాజాగా 15, 16, 17 ఏళ్ల పిల్లలను ఓటర్లుగా చేర్పించేందుకు సునీత పాట్లు పడుతోందని ధ్వజమెత్తారు. సమావేశంలో మార్కెట్ యార్డు చైర్మన్ గోపాల్‌రెడ్డి, వైఎస్సార్‌సీపీ నాయకులు ధనుంజయయాదవ్, ఈశ్వరయ్య పాల్గొన్నారు.

శరవేగంగా రీ-సర్వే

- భూ వివాదాలకు చెక్



సర్వే అనంతరం రోవర్ ద్వారా భూమి హద్దులు గుర్తిస్తున్న దృశ్యం (ఫైల్)

అనంతపురం అర్బన్: భూ వివాదాలు... సమస్యలకు శాశ్వత పరిష్కారం చూపేందుకు రాష్ట్ర ప్రభుత్వం 'జగనన్న శాశ్వత భూ హక్కు, భూరక్ష' ద్వారా చేపట్టిన భూముల సమగ్ర రీ సర్వే జిల్లాలో శరవేగంగా సాగుతోంది. 31 మండలాల పరిధిలోని 503 గ్రామాల్లో 10,188.59 చదరపు కిలో మీటర్లు సర్వే చేయనున్నారు. తొలి విడతలో 47 గ్రామాలు, రెండో విడతలో 40 గ్రామాల్లో సర్వే పూర్తి చేశారు. మూడో విడతలో 115 గ్రామాల్లో సర్వే చేపట్టారు.

సర్వే ప్రక్రియ వేగవంతం

జిల్లాలో సమగ్ర సర్వే ప్రక్రియ వేగవంతంగా నిర్వహిస్తున్నారు. మొత్తం 503 గ్రామాల్లో డ్రోన్ ఫ్లై పూర్తి చేశారు. 449 గ్రామాలకు సంధించి ఆర్థో రెక్టిఫైడ్ ఇమేజస్ వచ్చాయి. తొలి విడత కింద 43 గ్రామాల్లో, రెండవ విడతలో 40 గ్రామాల్లో సర్వేకు సంబంధించి అన్ని ప్రక్రియలూ పూర్తి చేశారు. మూడో విడత కింద 115 గ్రామాల్లో సర్వే చేపట్టారు. ఇప్పటి వరకు 58 గ్రామాల్లో తుది ఆర్ఓఆర్ ప్రక్రియ పూర్తి చేశారు. 22 గ్రామాల్లో హద్దురాళ్లు ఏర్పాటు చేశారు.

సిబ్బందికి శిక్షణ

భూముల సర్వేను అధికారులు వేగవంతం చేశారు. సర్వేలో భాగమైన సర్వే అసిస్టెంట్లు, మండల సర్వేయర్లు, వీఆర్‌ఓలు, తదితర సిబ్బందికి ప్రత్యేకంగా శిక్షణ ఇచ్చారు. రీ-సర్వే చేసిన తరువాత భూమి హద్దులను రోవర్ ద్వారా ఎలా గుర్తించాలి అనే అంశంపై క్షేత్ర స్థాయి శిక్షణ ఇచ్చారు.

అభాగ్యులకు సేవే లక్ష్యం

ప్రశాంతి నిలయం: ప్రపంచ నలుమూలలా ఉన్న అభాగ్యులకు సత్యసాయి సేవలను విస్తరించడమే ప్రతి భక్తుడి లక్ష్యం కావాలని సత్యసాయి గ్లోబల్ కౌన్సిల్ వైస్ చైర్మన్ నిమిష్ పాండ్య పిలుపునిచ్చారు. నేపాల్ సత్యసాయి సేవా సంస్థల గోల్డెన్ జూబ్లీ వేడుకలు రెండో రోజు శనివారం ప్రశాంతి నిలయంలో ఘనంగా జరిగాయి. విద్యార్థులకు రామాయణం, సత్యసాయి, మహాభారతంలపై క్విజ్ పోటీలు నిర్వహించారు. ప్రతిభ చూపిన విద్యార్థులకు బహుమతులు ప్రదానం చేశారు. అనంతరం నేపాల్‌లోని సత్యసాయి బాల సేవా ఆశ్రమం, సత్యసాయి వృద్ధాశ్రమ చిన్నారులు, సిబ్బంది సంగీత కచేరీ నిర్వహించారు. నేపాల్ ఇంటిగ్రేటెడ్ పర్సనాలిటీ డెవలప్‌మెంట్ సంస్థ నుంచి గ్రాడ్యుయేషన్ పూర్తి చేసుకున్న విద్యార్థులకు సర్టిఫికెట్లు అందించారు. ఈ సందర్భంగా నిమిష్ పాండ్య మాట్లాడుతూ భవిష్యత్తులో సత్యసాయి సేవలను మరింత విస్తరిస్తామన్నారు. ప్రతి భక్తుడు ఆయన మార్గాన్ని అనుసరించాలన్నారు.

'నలంద' విద్యార్థిని ఆత్మహత్య

- హాస్టల్ భవనంపై నుంచి దూకిన విద్యార్థిని
- ఘటనపై సమగ్ర దర్యాప్తునకు ఎస్పీ ఆదేశం

అనంతపురం క్రైం: నగరంలోని రైల్వేస్టేషన్ వద్ద ఉన్న నలంద జూనియర్ కళాశాలలో ఇంటర్మీడియెట్ రెండో సంవత్సరం చదువుతున్న పాటిల్ సుధ (18) అనే విద్యార్థిని ఆత్మహత్య చేసుకుంది. కాలేజీ హాస్టల్ భవనంపై నుంచి దూకి మృతిచెందింది. శుక్రవారం సాయంత్రం జరిగిన ఈ ఘటన ఆలస్యంగా వెలుగు చూసింది. పోలీసుల కథనం మేరకు.. బొమ్మనహాళ్ మండలం కల్లుహోళ గ్రామానికి చెందిన శంకర్‌గౌడ్, రత్నమ్మ దంపతుల కుమార్తె సుధ నగరంలోని నలంద కళాశాలలో ఇంటర్ (సీఈసీ గ్రూపు) రెండో సంవత్సరం చదువుతోంది. సమీపంలోని మేడా నర్సింగ్ హోం వద్ద ఉన్న అదే కళాశాల హాస్టల్లో ఉంటోంది. గౌరమ్మ పండుగ కోసం ఇటీవల ఊరెళ్లిన సుధ శుక్రవారం తిరిగొచ్చింది. మధ్యాహ్నం 2.40 గంటలకు హాస్టల్‌కు చేరుకుంది. తండ్రికి ఫోన్ చేసి తాను చేరుకున్న విషయం చెప్పింది. అనంతరం కళాశాలకు వెళ్లి సాయంత్రం 5.52 గంటలకు మిత్రులతో కలసి హాస్టల్‌కు తిరిగొచ్చింది. నాల్గవ అంతస్తులోని రూమ్ నంబర్-7లో తనతో పాటు మరో ఐదుగురు విద్యార్థినులు ఉంటున్నారు. వారితో కొంతసేపు మాట్లాడిన తర్వాత కన్నీళ్లు పెట్టుకుంటూ గదిలోంచి బయటకు వచ్చింది. గది తలుపులకు బయట గడియ పెట్టింది. కారిడార్ వాష్ బేసిన్ వైపు వెళ్లింది. అక్కడ లాక్ చేసి ఉన్న గ్రిల్‌డోర్ పైకి ఎక్కి కారిడార్ వైపు కిందకు దిగింది. నాల్గవ అంతస్తు నుంచి సరిగ్గా 6.44 గంటలకు కిందకు దూకింది. బయట నుంచి పెద్ద శబ్దం రావడంతో గది లోపలున్న విద్యార్థినులు గట్టిగా తలుపులు తట్టారు. ఆ శబ్దానికి వార్డెన్ వచ్చి తలుపులు తీసి ఎందుకిలా చేస్తున్నారంటూ ఆరా తీశారు. సుధ కిందకు పడిపోయిన శబ్దం వచ్చిందని చెప్పారు. దీంతో కిందకు చూడగా హాస్టల్ పక్క కాంపౌండులోని సిమెంటు ప్లాట్‌ఫాంపై పడి ఉంది. ఆమెను వెంటనే పక్కనే ఉన్న ప్రైవేటు నర్సింగ్ హోమ్‌కు..అక్కడి నుంచి ప్రభుత్వాస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స ప్రారంభించిన గంట వ్యవధిలోనే మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు.

గోప్యంగా ఉంచిన కాలేజీ యాజమాన్యం

ఘటన శుక్రవారం సాయంత్రం 6.44 గంటలకు జరగ్గా..కాలేజీ యాజమాన్యం మాత్రం రాత్రి తొమ్మిది గంటలకు పోలీసులకు సమాచారం ఇచ్చింది. విద్యార్థిని తల్లిదండ్రులకు తెలియజేయడంతో వారు స్వగ్రామం నుంచి అర్ధరాత్రి అనంతపురానికి చేరుకున్నారు. ఆ తర్వాతే విషయం బయటకు తెలిసింది. విద్యార్థి సంఘాల నేతలు శనివారం కాలేజీ హాస్టల్ ముందు ఆందోళన చేపట్టారు. విద్యార్థిని మృతికి కారణమైన కళాశాల యాజమాన్యంపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.





సుధ (ఫైల్), నలంద కాలేజీ హాస్టల్ భవనం

కుమార్తె మృతిపై అనుమానాలున్నాయి..

కళాశాల యాజమాన్యం వైఖరితోనే తమ బిడ్డ చనిపోయిందని, మృతిపై అనుమానాలు ఉన్నాయని సుధ తల్లిదండ్రులు త్రీటౌన్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఒంటిపై ఎక్కడా రక్తగాయాలు లేకపోయినా గొంతు కింది భాగంలో మాత్రం గాట్లు ఉన్నట్లు తెలిపారు. నాలుగు అంతస్తుల భవనంపై నుంచి కిందకు పడితే శరీరం ఛిద్రమవుతుందని, కానీ కనీసం కాలు, చెయ్యి కూడా చెక్కు చెదరలేదని, తమ బిడ్డను హత్య చేసి కిందకు నెట్టి ఉండొచ్చని ఫిర్యాదులో పేర్కొన్నారు. కాగా.. విద్యార్థిని మృతి ఘటనను ఎస్పీ అన్బురాజన్ సీరియస్‌గా పరిగణించారు. మృతికి గల కారణాలపై సమగ్ర దర్యాప్తునకు ఆదేశించారు. దిశ డీఎస్పీ ఆంథోనప్పను దర్యాప్తు అధికారిగా నియమించారు.

లెయ్ తల్లీ ఊరికి వెళదాం!

సుధ మృతిని తల్లి రత్నమ్మ జీర్ణించుకోలేక పోయింది. 'అమ్మా సుధా.. లెయ్ తల్లి ఊరికి వెళదాం' అంటూ కుమార్తె మృతదేహంపై పడి గుండెలవిసేలా రోదిస్తుంటే ఆమెను ఓదార్చడం ఎవరి వల్ల కాలేదు. చివరికి పోలీసులే ధైర్యం చెప్పారు. 'బాగా చదువుతుంది సార్..బుద్ధిమంతురాలు. ఎవరితోనూ గొడవలకు వెళ్లదు. ఏ దేవుడికి కన్నుకుట్టి నా బిడ్డను ఇలా తీసుకుపోయాడో' అంటూ కన్నీరు మున్నీరైంది. 'మంచిగా చదివి నాన్నను, నిన్ను బాగా చూసుకుంటానంటివే. ఇలా మోసం చేసి వెళ్లిపోయావా తల్లీ' అంటూ గుండెలు బాదుకుంది.

లోతుగా దర్యాప్తు చేస్తాం

విద్యార్థిని సుధ మృతికి దారి తీసిన కారణాలపై లోతుగా దర్యాప్తు చేస్తామని దిశ డీఎస్పీ ఆంథోనప్ప తెలిపారు. ఆయన శనివారం నగర డీఎస్పీ ప్రసాద్ రెడ్డి, వన్‌టౌన్ సీఐ రెడ్డప్పతో కలసి విలేకరులతో మాట్లాడారు. సుధ కిందకు దూకినప్పుడు కుడికాలు ముందుగా నేలను తాకి తొడ ఎముకభాగం విరిగిందని, దానిపై ఉన్న బక్రెముకలు కూడా విరిగిపోయి కొనలు ఊపిరితిత్తుల్లోకి చొచ్చుకుపోయాయని తెలిపారు. దీనివల్ల ఊపిరితిత్తుల్లోకి, ఇతర శరీరభాగాల్లోకి రక్తం వెళ్లి గడ్డ కట్టడం వల్ల హేమరేజ్ షాక్ జరిగి మృతి చెందిందని వివరించారు.

క్లుప్తంగా

ఆక్వా అభివృద్ధికి కృషి

- మత్స్యశాఖ డీడీ కె.శ్రీనివాసనాయక్



కలెక్టర్ ఎం.గౌతమిని మర్యాదపూర్వకంగా కలిసిన శ్రీనివాసనాయక్

అనంతపురం అగ్రికల్చర్: 'అనంత'లో ఆక్వా రంగం అభివృద్ధి, మత్స్యకారుల సంక్షేమానికి కృషి చేస్తానని జిల్లా మత్స్యశాఖ ఉపసంచాలకులు (డిప్యూటీ డైరెక్టర్–డీడీ) కె.శ్రీనివాస నాయక్ అన్నారు. శనివారం స్థానిక మత్స్యశాఖ కార్యాలయంలో డీడీగా ఆయన బాధ్యతలు స్వీకరించారు. అనంతరం మర్యాద పూర్వకంగా కలెక్టర్ కె.గౌతమిని కలిశారు. తిరుపతిలో పనిచేస్తున్న శ్రీనివాసనాయక్ ఇక్కడకు బదిలీపై వచ్చిన విషయం తెలిసిందే. ఆయన స్వస్థలం తెలంగాణలోని మహబూబ్ నగర్ కాగా ఉభయ గోదావరి, కృష్ణా, గుంటూరు, నెల్లూరు, తిరుపతి తదితర జిల్లాల్లో పనిచేశారు. బదిలీపై వైఎస్సార్ జిల్లాకు వెళుతున్న కె.శాంతిని మత్స్యశాఖ తరఫున సన్మానించారు. కార్యక్రమంలో ఎఫ్‌డీఓలు ఆసిఫ్, లక్ష్మీనారాయణ, ఫక్కీరప్ప, మత్స్యకార సంఘం నాయకుడు పోతన్న పాల్గొన్నారు.

పవన్ కళ్యాణ్ మాటలు అర్థరహితం



మాట్లాడుతున్న పసుపులేటి పద్మావతి, సందీప్ రాయల్

అనంతపురం కార్పొరేషన్: సీఎం వైఎస్ జగన్ మోహన్‌రెడ్డిపై ఇటీవల జనసేన అధినేత పవన్ కళ్యాణ్ చేసిన మాటలు అర్థరహితమని పవన్ కళ్యాణ్ ఆఫీస్ పూర్వ కార్యదర్శి, వైఎస్సార్‌సీపీ నేత పసుపులేటి సందీప్‌రాయల్, పద్మావతి స్పష్టం చేశారు. జిల్లా వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో శనివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. పవన్‌కళ్యాణ్ సిద్ధాంతాలు నచ్చక తాము ఆ పార్టీని వీడి, సీఎం వైఎస్ జగన్‌పై ఉన్న అభిమానంతో ప్రభుత్వ సలహాదారు సజ్జల రామకృష్ణారెడ్డి సమక్షంలో వైఎస్సార్ సీపీలోకి చేరినట్లు గుర్తు చేశారు. దీంతో తనపై కొందరు వ్యక్తిగత కక్షతో విమర్శలు చేస్తున్నారని, జనసేన అధికారంలోకి వచ్చాక సంగతి చూస్తామంటూ దిగజారుడు వ్యాఖ్యలు చేస్తున్నారన్నారు. ఇది వారి నైతిక పతనానికి నిదర్శనమన్నారు. పవన్ కళ్యాణ్ ఓ పొలిటికల్ బ్రోకర్ అని విమర్శించారు. రానున్న ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ గెలుపును అడ్డుకోవడం ఎవరి తరమూ కాదన్నారు.

బహుముఖ ప్రజ్ఞాశాలి కుంచె

- పెయింటింగ్‌లో రాణిస్తూనే చిత్ర దర్శకుడిగా
- కళ్యాణదుర్గం మండలం కామక్కపల్లి యువకుడి విజయప్రస్థానం

అనంతపురం కల్చరల్: బతుకుతెరువు కోసం నేర్చుకున్న చిత్రలేఖనం ఆ యువకుడిని ఇతరులు అందుకోలేనంత స్థాయికి తీసుకెళ్లింది. కష్టాలను సమర్థవంతంగా జయించినప్పుడే కలలు కన్న జీవితం సాకారమవుతుందని నమ్మిన ఆయన తన బతుకు పోరులో ఎన్నో ఒడిదుడుకులను ఎదుర్కొన్నారు. పెయింటింగ్‌లో ఎన్నో వినూత్న ప్రయోగాలు చేస్తూనే నటుడిగా, దర్శకుడిగా, షార్ట్‌ఫిల్మ్ మేకర్‌గా బహుముఖ ప్రజ్ఞ ప్రదర్శిస్తున్న కుంచె తిప్పేస్వామిపై 'సాక్షి' ప్రత్యేక కథనం.

పేదరికాన్ని జయించిన ప్రతిభ

కళ్యాణదుర్గం మండలం కామక్కపల్లికి చెందిన తిప్పేస్వామి నిరుపేద కుటుంబంలో జన్మించాడు. బాల్యమంతా ఆర్డీటీ పర్యవేక్షణలోనే సాగింది. ట్రస్ట్ ప్రోత్సాహంతో 8వ తరగతి వరకు చదువుకున్నాడు. బడికెళ్లే రోజుల్లో పెన్నులు, పెన్సిళ్లతో బొమ్మలు గీస్తూ అందరి మెప్పు పొందేవాడు. ఈ క్రమంలోనే ఈశ్వర్ అనే ఆర్టిస్ట్ వద్ద పెయింటింగ్‌లో మెలకువలు తెలుసుకుని చివరకు దానినే ఉపాధిగా మలుచుకున్నాడు. ఆధునిక సాంకేతికతను అందిపుచ్చుకుని కంప్యూటరైజ్డ్ ఆర్ట్‌లో వినూత్న ప్రయోగాలు చేస్తూ అందరినీ ఆకర్షిస్తున్నాడు. జిల్లాలోని అనేక గోడలపై కనిపిస్తున్న అద్భుత చిత్రాలు తిప్పేస్వామి కుంచె నుంచి జాలువారినవే కావడం గమనార్హం.

నటుడిగానూ రాణిస్తూ..

ఓ వైపు పెయింటింగ్‌లో రాణిస్తూనే మరో వైపు నటుడిగా తనలోని కళాకారుడిని ఈ ప్రపంచానికి తిప్పేస్వామి పరిచయం చేశాడు. కుంచె పేరుతో ఓ లఘుచిత్రం తీసి ప్రేక్షకుల మన్నన పొందాడు. చిత్రలేఖనం ప్రాణంగా భావించే ఓ దివ్యాంగుడి పాత్రలో ఒదిగిపోయిన తిప్పేస్వామి నటన విమర్శకులను సైతం అబ్బురపరిచింది. ఈ ప్రోత్సాహంతో 'గో కరోనా, రక్షకుడు, కనపడుటలేదు' తదితర చిత్రాలు తీశాడు. ఇటీవల విజయవంతమైన 'పలాస' చిత్రం పోస్టర్లను సైతం తిప్పేస్వామినే రూపొందించాడు. ప్రస్తుతం టాకీస్ చానల్ ద్వారా యూట్యూబ్ రీల్స్ చేసేవారిలో అత్యధిక ప్రజాదరణ కళాకారుల్లో తిప్పేస్వామి ముందువరుసలో ఉన్నాడు.



బుద్ధుడి చిత్రాన్ని గీస్తున్న తిప్పేస్వామి

అనంత ఖ్యాతి ఘనంగా చాటాలి



ఎంతో మంది కళాకారులు, సాహితీవేత్తలు అద్వితీయమైన ప్రతిభ సంపత్తితో జిల్లా ఖ్యాతిని ఘనంగా చాటారు. వారి స్ఫూర్తితోనే నేను బ్రష్‌నే నమ్ముకుని జీవిస్తున్నా. ప్రతిభకు పేదరికం అడ్డు కాదనే సందేశాన్ని యువతలో నింపడానికి అనేక సందర్భాలను వాడుకున్నాను. మంచి కథలు రెడీగా ఉన్నాయి. కళారంగంలో ఆసక్తి కలిగిన వారు ముందుకు వస్తే అద్భుతమైన లఘు చిత్రాలు తీసి జిల్లా ఖ్యాతిని ఘనంగా చాటాలన్నదే నా ఆశయం.

– కుంచె తిప్పేస్వామి, కళాకారుడు

యువకుడి ఆత్మహత్య

యాడికి: వేరు కాపురం పెట్టే వరకూ తాను రానంటూ పుట్టింటికి వెళ్లిన భార్య తెగేసి చెప్పడంతో జీవితంపై విరక్తిచెంది ఓ యువకుడు ఆత్మహత్య చేసుకున్నాడు. పోలీసులు తెలిపిన మేరకు... యాడికి మండలం కూర్మాజీపేటకు చెందిన గంగరాజు, కృష్ణవేణి దంపతులకు ఇద్దరు కుమారులు. పెద్ద కుమారుడు విజయ్ (24)కు పామిడి మండలం గజరాంపల్లికి చెందిన పూజితతో ఏడు నెలల క్రితం వివాహమైంది. ప్రస్తుతం ఆమె మూడు నెలల గర్భిణి. ఈ క్రమంలో నిద్ర చేసేందుకని పూజితను తల్లిదండ్రులు నెల రోజుల క్రితం ఇంటికి పిలుచుకెళ్లారు. ఆ తర్వాత ఆమెను పిలుచుకొచ్చేందుకు విజయ్ వెళ్లాడు. అయితే వేరు కాపురం పెట్టాలని, అప్పటి వరకూ తాను రానని పూజిత తెలపడంతో నచ్చచెప్పేందుకు ప్రయత్నించాడు. ఆమె ససేమిరా అనడంతో స్వగ్రామానికి ఒంటరిగానే చేరుకున్నాడు. ఈ క్రమంలోనే ముభావంగా ఉంటూ వచ్చిన కుమారుడిని చూసిన తల్లిదండ్రులు పదేపదే ప్రశ్నిస్తున్నా... సమాధానం చెప్పలేక సతమతమయ్యాడు. చివరకు తన భార్య లేవనెత్తిన వేరు కాపురం అంశాన్ని శుక్రవారం రాత్రి తల్లిదండ్రులతో చెప్పుకుని కుమిలిపోయాడు. దీంతో తల్లిదండ్రులు సముదాయించి వేరు కాపురం పెట్టేందుకు సమ్మతించారు. భోజనం ముగించుకుని బెడ్‌రూంలోకి వెళ్లిన విజయ్.. శనివారం ఉదయమైనా తలుపులు తీయకపోవడంతో అనుమానం వచ్చిన కుటుంబసభ్యులు ఇంటి వెనుక ఉన్న కిటికీ తలుపులు తీసి చూశారు. అప్పటికే ఫ్యాన్‌కు చీరతో ఉరి వేసుకుని విగతజీవిగా వేలాడుతున్న విజయ్‌ను చూసి బోరున విలపించారు. విషయం తెలుసుకున్న బంధువులు అక్కడకు చేరుకుని బెడ్‌రూం తలుపులు బద్ధలుగొట్టి లోపలకు ప్రవేశించి విజయ్ మృతదేహాన్ని కిందకు దించారు. సమాచారం అందుకున్న ఎస్‌ఐ గురుప్రసాదరెడ్డి కూర్మాజీపేట గ్రామానికి చేరుకుని ఘటనపై ఆరా తీశారు. గంగరాజు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టారు. కాగా, భర్త మృతితో కూర్మాజీపేటకు చేరుకున్న భార్య పూజిత విజయ్ మృతదేహంపై పడి రోదించిన తీరు అందరినీ కంట తడి పెట్టించింది.



విజయ్ (ఫైల్)

రోడ్డు ప్రమాదంలో ఇద్దరి దుర్మరణం

తుమకూరు (కర్ణాటక): బైక్‌ను వెనుక నుంచి లారీ ఢీకొన్న ఘటనలో అనంతపురం జిల్లాకు చెందిన ఇద్దరు మృతి చెందారు. శుక్రవారం రాత్రి కర్ణాటకలోని తుమకూరు జిల్లా శిర తాలూకా జాతీయ రహదారిపై ఈ ఘటన చోటు చేసుకుంది. మృతులను రాయదుర్గం మండలం భూపసంద్రం గ్రామానికి చెందిన ఎర్రిస్వామి (30), చందు (22)గా గుర్తించారు. గొర్రెల ఎరువు నింపుకుని గుబ్బి వైపు వెళుతున్న ఓ లారీ రోడ్డుపై ముందు వెళుతున్న ద్విచక్ర వాహనాన్ని ఢీకొంది. బైక్‌పై ఉన్న ఇద్దరూ అక్కడికక్కడే మృతి చెందారు. ఘటనపై శిర పోలీసులు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టారు.

మల్బరీ సాగుతో ఆదాయం మెండు

- పట్టుపరిశ్రమశాఖ జిల్లా అధికారి డి.ఆంజనేయులు

అనంతపురం అగ్రికల్చర్: ప్రస్తుత పరిస్థితుల్లో మల్బరీ (రేషం) సాగు లాభదాయకంగా ఉందని పట్టుపరిశ్రమశాఖ జిల్లా అధికారి (డీఎస్‌ఓ) డి.ఆంజనేయులు తెలిపారు. అనంతపురం రూరల్ మండలం కందుకూరులో శనివారం పట్టుబడి కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమానికి హాజరైన ఆయన మల్బరీ సాగుపై రైతులకు అవగాహన కల్పించారు. పొలంలో పుల్ల నాటుకునే దశ నుంచి మార్కెట్‌లో పట్టుగూళ్లు అమ్ముకునే వరకూ రాష్ట్ర ప్రభుత్వం రైతులకు అందజేస్తున్న ప్రోత్సాహకాలను వివరించారు. ఎస్సీ ఎస్టీ వర్గాలకు రాయితీ మరింత ఎక్కువగా ఉంటుందన్నారు. ఎకరా విస్తీర్ణంలో పుల్ల నాటేందుకు ఎస్సీ ఎస్టీ వర్గాలకు రూ.22,500, ఇతర వర్గాల రైతులకు రూ.18,750 ప్రోత్సాహకాన్ని అందజేస్తామన్నారు. షెడ్ల నిర్మాణం, మందులు, సూట్‌రేటింగ్, యాంత్రీకరణ, షెడ్డు పరిశుభ్రత, చాకీ పురుగులు, మార్కెట్‌లో ఇన్సెంటివ్‌లు వర్తింపజేస్తామన్నారు. జిల్లాలో ఈ ఏడాది 1,000 ఎకరాల్లో కొత్తగా మల్బరీ తోటలను విస్తరించే లక్ష్యంతో పనిచేస్తున్నట్లు తెలిపారు. పంట సాగు, పెంపకం, మార్కెటింగ్‌లో మేలైన యాజమాన్య పద్ధతులపై రైతుల్లో అవగాహన కల్పించే నిమిత్తం ఆర్‌బీకే వేదికగా 60 పట్టుబడి కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో పట్టుశాఖ అధికారులు ఓబులేసు, రామలింగారెడ్డి, పద్మావతి, పలువురు రైతులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఆంజనేయులు

ప్రమాదంలో వివాహిత మృతి

- చికిత్స పొందుతున్న భర్త

రాప్తాడు రూరల్: కారు డ్రైవర్ అనాలోచిత నిర్ణయం ఓ వివాహిత ప్రాణాలు బలిగొంది. ఆమె భర్తను ఆస్పత్రి పాలు చేసింది. వివరాలు... శెట్టూరు మండలం లింగదీర్లపల్లికి చెందిన ఎరికల మాంతేష్ కొన్నేళ్ల క్రితం గార్లదిన్నె మండలం కోటంకకు చెందిన ఎరికల చిట్టెమ్మను పెళ్లి చేసుకున్నాడు. వీరికి ఇద్దరు కుమారులున్నారు. ప్రస్తుతం కోటంక గ్రామంలోనే నివాసముంటున్న వీరు... బేల్దారి పనులతో జీవనం సాగిస్తున్నారు. ఈ క్రమంలోనే శనివారం ఉదయం పని కోసం అనంతపురం రూరల్ మండలం కురుగుంటకు ద్విచక్ర వాహనంపై బయలుదేరారు. అక్కంపల్లి క్రాస్ దాటి వైట్‌ఫీల్డ్ వెంచర్ వద్దకు చేరుకోగానే ఎదురుగా వెళుతున్న కారు డ్రైవర్ అనాలోచితంగా తన వాహనాన్ని కుడివైపు తిప్పాడు. అప్పటికే ఆ వాహనాన్ని ఓవర్ టేక్ చేస్తున్న మాంతేష్ తన బైక్ అదుపు చేసేంత సమయం కూడా లేక కారును ఢీకొన్నాడు. ఘటనలో రోడ్డుపై పడిన చిట్టెమ్మ తలకు బలమైన గాయమైంది. మాంతేష్ కాలు విరిగింది. అదే సమయంలో అటుగా వెళుతున్న కురుగుంట ఎంపీటీసీ మాజీ సభ్యుడు కిరణ్ కుమార్ రెడ్డి, తదితరులు క్షతగాత్రులను ఓ ఆటోలో సర్వజనాస్పత్రికి తరలించారు. చికిత్సకు స్పందించక చిట్టెమ్మ మృతి చెందింది. సమాచారం అందుకున్న రూరల్ పోలీసులు ఘటనాస్థలాన్ని పరిశీలించి, కేసు నమోదు చేశారు. కాగా, ప్రమాదానికి కారణమైన కారు... పోలీసు శిక్షణ కళాశాలలో పనిచేస్తున్న హెడ్‌కానిస్టేబుల్ మురళీకృష్ణారెడ్డిదిగా ప్రాథమిక దర్యాప్తులో పోలీసులు గుర్తించారు.



అపస్మారక స్థితిలో పడి ఉన్న చిట్టెమ్మ



ప్రమాదానికి కారణమైన కారు

జేఎన్‌టీయూలో బదిలీలు

అనంతపురం: జేఎన్‌టీయూ(ఏ) పరిధిలోని పలువురు ఉద్యోగులను బదిలీ చేస్తూ ఉత్తర్వులు జారీ అయ్యాయి. బదిలీ అయిన వారిలో వర్సిటీలోని పరీక్షల విభాగం డిప్యూటీ రిజిస్ట్రార్ రంగా నాయక్‌ను ఎస్టాబ్లిష్‌మెంట్ విభాగానికి, అక్కడ పనిచేస్తున్న ఎస్.మధుసూదన్‌రెడ్డిని పరీక్షల విభాగానికి బదిలీ చేశారు. ఓటీపీఆర్‌ఐ అసిస్టెంట్ రిజిస్ట్రార్ ఎ.ప్రభాకర్ కలికిరికి, అక్కడ పనిచేస్తున్న అబ్దుల్ ఖాదర్ అనంతపురానికి బదిలీ అయ్యారు. క్యాంపస్ కళాశాల ఏఆర్ జీఎస్ శంకరరెడ్డికి ఓటీపీఆర్‌ఐ కేటాయించారు. ఆర్‌అండ్‌డీ సూపరింటెండెంట్ జి.జనార్దనరెడ్డిని ఎస్టాబ్లిష్‌మెంట్ విభాగానికి బదిలీ చేశారు. అక్కడ పనిచేస్తున్న సీనియర్ అసిస్టెంట్ కె.రాజేష్‌ను ఆర్‌అండ్‌డీకి, క్యాంపస్ కళాశాలలోని సీనియర్ అసిస్టెంట్ గౌసియా నస్రీన్‌ను అకడమిక్ అండ్ ఆడిట్ విభాగానికి, మరో సీనియర్ అసిస్టెంట్ అబ్బాస్ అలీని డిక్స్‌కు బదిలీ చేశారు. ఈ మేరకు వర్సిటీ వీసీ డాక్టర్ జింకా రంగజనార్ధన ఆదేశాలతో రిజిస్ట్రార్ ప్రొఫెసర్ సి.శశిధర్ శనివారం ఉత్తర్వులు జారీ చేశారు.

పవర్ గ్రిడ్ ఏర్పాటుకు సహకరించండి : జేసీ

గుంతకల్లు: మండలంలోని తిమ్మాపురం సమీపంలో పవర్ గ్రిడ్ ఏర్పాటుకు సహకరించాలని రైతులకు జాయింట్ కలెక్టర్ కేతన్‌గార్గ్ విజ్ఞప్తి చేశారు. గ్రిడ్ ఏర్పాటు అంశంపై శనివారం సాయంత్రం గుంతకల్లు ఆర్డీఓ కార్యాలయంలో తిమ్మాపురం, దోనిముక్కల గ్రామాల రైతులతో ఆయన సమావేశమై మాట్లాడారు. గ్రిడ్ ఏర్పాటుకు దాదాపు 54 ఎకరాల భూమి అవసరమని, ఈ క్రమంలో 39 మంది రైతుల పొలాలను సేకరించాల్సి వస్తోందన్నారు. భూమిని కోల్పోతున్న రైతులకు పరిహారం చెల్లించేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉందన్నారు. కార్యక్రమంలో ఆర్డీఓ శ్రీనివాసరెడ్డి, డిప్యూటీ తహసీల్దార్ రాము తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా షర్మస్ హుస్సేనీ ఉరుసు

బొమ్మనహాళ్: మండలంలోని దర్గాహొన్నూరులో వెలసిన షర్మస్ హుస్సేనీ ఉరుసు శనివారం అంగరంగ వైభవంగా సాగింది. వేకువజామునే వివిధ ప్రాంతాల నుంచి తరలివచ్చిన భక్తులతో దర్గా పరిసరాలు కిక్కిరిసాయి. విశేష పూలతో స్వామి మహాసమాధిని అలంకరించారు. చాదర్ సమర్పణ, చక్కెర చదివింపులు పెద్ద ఎత్తున జరిగాయి. దర్గా ఆవరణలో చక్కెర తులాభారంతో మొక్కులు తీర్చుకున్నారు. బంధుమిత్రులతో కలిసి వచ్చిన స్థానికులు దర్గా ఆవరణలో కందూరిలు నిర్వహించారు. కాగా, ఆదివారం తెల్లవారుజామున షర్మస్ హుస్సేనీ షంషేర్ ఉత్సవం ఉంటుందని నిర్వాహకులు తెలిపారు.





భక్తులతో కిక్కిరిసిన దర్గా (ఇన్‌సెట్‌లో)దర్గాలోని షర్మస్ హుస్సేనీ మహాసమాధి

జనవాక్కు

గతమంతా కష్టాలే



గత ప్రభుత్వ హయాంలో కష్టాలు.. ఇబ్బందులు తప్ప మరేమీ చూడలేదు. వైఎస్ జగన్ ముఖ్యమంత్రి అయిన తర్వాత పింఛన్ కష్టాలు తీరాయి. ప్రతి నెలా 1వ తారీఖునే ఇంటి వద్దకే వచ్చి పింఛన్ అందజేస్తున్నారు. వలంటీర్ వ్యవస్థ చాలా బాగుంది. ఎలాంటి సర్టిఫికెట్ కావాలన్నా ఇంటి వద్దనే తీసుకుంటున్నాం. ప్రభుత్వ కార్యాలయం చుట్టూ తిరిగే బాధ తప్పింది. జగనన్న సురక్ష కార్యక్రమం ద్వారా నేనూ కుల, ఆదాయ ధ్రువీకరణ పత్రాలు పొందాను. సీఎం వైఎస్ జగన్ పాలన చాలా బాగుంది.

– చిన్నరంగడు, పెద్దవడుగూరు

నాకు ఆయువు పోశారు



నాకు 62 ఏళ్లు. లారీ డ్రైవర్‌గా పనిచేసే నా భర్త వీరన్న 30 ఏళ్ల క్రితమే మరణించాడు. ముగ్గురు కుమారులు, ఓ కుమార్తెను అతి కష్టంపై పెంచి పెద్ద చేశా. కూలి పనులు చేస్తూ కష్టపడి దాచుకున్న డబ్బుతో పిల్లలందరికీ పెళ్లిళ్లు చేశా. ప్రస్తుతం నా చిన్న కొడుకు ఉరుకుంద ఇంట్లో ఉంటున్నా. నా కోడలు నైటీలు కుడుతుంటే వాటిని ప్యాకింగ్ చేస్తుంటాను. జీవితం బాగుపడుతోందనుకుంటున్న తరుణంలో గత ఏడాది జూలైలో గుండెనొప్పి వచ్చింది. వెంటనే నన్ను ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తీసుకెళ్లారు. తర్వాత డాక్టర్ వైఎస్సార్ ఆరోగ్యశ్రీ పథకం కింద అనంతపురంలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తీసుకెళ్లి ఉచితంగా ఆపరేషన్ చేసి, నాకు ఆయువు పోశారు. ఐదు రోజుల పాటు ఆస్పత్రిలోనే ఉన్నాం. ఒక్క పైసా కూడా మా చేతి నుంచి ఖర్చు కాలేదు. డిశ్చార్జ్ సమయంలో ఏడాదికి సరిపోయే మందులూ ఇచ్చారు. అతే కాక వైఎస్సార్ చేయూత ద్వారా ఏటా రూ.18,750 చొప్పున మూడుసార్లు డబ్బులు పడ్డాయి. ప్రతి నెలా రూ.2,750 వితంతు పింఛన్ అందజేస్తున్నారు. మరో పది కాలాల పాటు సీఎంగా వైఎస్ జగనే ఉండాలని కోరుకుంటున్నా. – పి.లక్ష్మీదేవి, గుంతకల్లు

ఇబ్బందులు తొలిగాయి



రాష్ట్ర ముఖ్యమంత్రిగా వైఎస్ జగన్ బాధ్యతలు తీసుకున్న తర్వాత ఆర్థిక ఇబ్బందులు దూరమయ్యాయి. ఇంటర్ వరకూ చదువుకున్న నా కుమారుడు ఆంజనేయులుకు వలంటీర్‌గా పని చేసే అవకాశం దక్కింది. ఆసరా పథకంతో నాకు ఏటా రూ.10 వేల చొప్పున మూడు దఫాలుగా రూ.30 వేల సాయం అందింది. నా భర్త హనుమంతుకు కళాకారుల పింఛన్ అందుతోంది. చేయూత పథకంతో ఏటా రూ.18,750 ఇస్తున్నారు. కొడుక్కి పెళ్లి చేయడంతో కల్యాణమస్తు పథకం కింద కోడలు దివ్యకు రూ.లక్ష లబ్ధి చేకూరింది. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో మా కష్టాలు పూర్తిగా తొలగిపోయాయి.

– హెచ్.రామాంజినమ్మ, రామనేపల్లి, బెళుగుప్ప మండలం

కంటి చూపు బాగుపడింది



కంటి చూపు సక్రమంగా లేక ఇబ్బంది పడేదాన్ని. డబ్బు సమస్య ఉండడంతో ఆస్పత్రికి వెళ్లలేక పోయాను. అయితే మా ఊళ్లోనే పెట్టిన జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరంలో చూపించుకుంటే అనంతపురంలోని పెద్దాస్పత్రికి తీసుకెళ్లి పరీక్షలు చేయించారు. అద్దాలిచ్చారు. ఇప్పుడు చూపు బాగుంది. ఇంటి వద్దకే డాక్టర్లు వచ్చి వైద్య చికిత్సలు చేసేలా చర్యలు తీసుకున్న సీఎం వైఎస్ జగన్ పాలన ఎంతో బాగుంది.

– లక్ష్మక్క, కమ్మూరు, కూడేరు మండలం

నగరంలో చైన్ స్నాచింగ్



చైన్‌స్నాచింగ్‌కు పాల్పడిన దుండగులు

అనంతపురం క్రైం: ఒంటరిగా వెళుతున్న మహిళ మెడలోని బంగారు నగలను దుండగులు లాక్కెళ్లారు. పోలీసులు తెలిపిన మేరకు.. అనంతపురంలోని ఎర్రనేల కొట్టాలకు చెందిన లావణ్య శనివారం ఉదయం స్థానిక రెవెన్యూ కాలనీలోని రామాలయానికి వెళ్లి పూజల్లో పాల్గొన్నారు. అనంతరం ఒంటరిగా ఇంటికి వెళుతున్న ఆమె మెడలోని 5 తులాల బంగారు గొలుసును ద్విచక్ర వాహనంపై అనుసరిస్తూ వచ్చిన ఇద్దరు దుండగులు లాక్కొని ఉడాయించారు. సమాచారం అందుకున్న పోలీసులు వెంటనే అక్కడకు చేరుకుని బాధితులను విచారణ చేశారు. హై అలర్ట్ యాప్‌ను అప్రమత్తం చేశారు. కేసు నమోదు చేసిన పోలీసులు సీసీ కెమెరా పుటేజీల ఆధారంగా దర్యాప్తు చేపట్టారు.

అంతర్ జిల్లా దొంగల అరెస్ట్

బత్తలపల్లి: అంతర్ జిల్లా దొంగలను అరెస్ట్ చేసి, వారి నుంచి పిడి బాకు, రెండు ఆటోలను స్వాధీనం చేసుకున్నట్లు బత్తలపల్లి ఎస్‌ఐ శ్రీనివాసులు తెలిపారు. వివరాలను శనివారం ఆయన వెల్లడించారు. బత్తలపల్లి స్టేషన్ పరిధిలో రెండు వేర్వేరు ప్రాంతాల్లో ఇటీవల 31 గొర్రెలను అపహరించిన కేసులో ఇప్పటికే దాసరి లక్ష్మన్న, లోచర్ల బాలకృష్ణ, దాసరి రాముని పోలీసులు అరెస్ట్ చేసి, సొత్తును కూడా రికవరీ చేశారు. ఇదే కేసులో పరారీలో ఉన్న ముదిగుబ్బ మండలం కొడవండ్లపల్లికి చెందిన తండ్రీకొడుకులు ముష్టూరు గంగులప్ప, హరికృష్ణని శనివారం ఉప్పర్లపల్లి క్రాస్ వద్ద అరెస్ట్ చేశారు. గంగులప్పపై అనంతపురం, తనకల్లు, హిందూపురం, బత్తలపల్లి, ముదిగుబ్బ పోలీస్ స్టేషన్‌లో పలు కేసులు ఉన్నాయి. హరికృష్ణ సాయంతో గంగులప్ప చోరీలకు పాల్పడేవాడు. కాగా, గత 12 ఏళ్లుగా వివిధ కేసుల్లో గంగులప్ప పోలీసుల కళ్లుగప్పి తిరుగుతున్నాడు. నిందితుల అరెస్ట్‌లో చొరవ చూపిన సిబ్బందిని డీఎస్పీ శ్రీనివాసులు, సీఐ ఆరోహణ రావు అభినందించారు.

క్లుప్తంగా

పునఃప్రతిష్ట కార్యక్రమాలు ప్రారంభం



ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్న రాజీవ్ తంత్రి

అనంతపురం కల్చరల్: నగరంలోని చెరువుకట్టపై వెలసిన శ్రీసాయి అయ్యప్ప ఆలయంలో పునః ప్రతిష్ట కార్యక్రమాలు, మండల పూజలు ఘనంగా ప్రారంభమయ్యాయి. శబరిమల సన్నిధానం నుంచి బహ్మశ్రీ రాజీవ్ తంత్రి సాయంత్రం నగరానికి విచ్చేసి, మండల పూజలను శాస్త్రోక్తంగా ఆరంభించారు. ఆయన చేతుల మీదుగా సాగిన పునఃప్రతిష్ట కార్యక్రమాలు, ఉత్సవ పూజల్లో వందలాది మంది అయ్యప్పలు స్వామివారి శరణుఘోషతో ఆలయాన్ని మార్మోగించారు. కార్యక్రమంలో కమిటీ అధ్యక్షుడు మణికంఠ గౌతం, ఆలయ కమిటీ సభ్యులు బోనా నాగలింగారెడ్డి, గజేంద్రమోహన్, నాగానందం, రాము, కేశవ పాల్గొన్నారు.

నేడు కోటి దీపోత్సవం

ఆత్మకూరు: మండలంలోని పంపనూరు సుబ్రహ్మణ్యేశ్వర స్వామి ఆలయంలో ఆదివారం కార్తీక మాస ఉత్సవాల్లో భాగంగా కోటి దీపోత్సవం ఉంటుందని ఆలయ ఈఓ అక్కిరెడ్డి, కమిటీ ,చైర్మన్ చంద్రశేఖర్‌రెడ్డి తెలిపారు. ఉదయమే దామోదర కల్యాణోత్సవంతో పాటు పంచామృతాభిషేకాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. సాయంత్రం కోటి దీపోత్సవం ఉంటుందన్నారు.

విద్యాభివృద్ధికి సీఎం జగన్ పెద్దపీట



విద్యార్థులకు బెడ్ షీట్లు పంపిణీ చేస్తున్న ఎంపీపీ హేమలత

ఆత్మకూరు: విద్యాభివృద్ధికి సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి పెద్ద పీట వేస్తున్నారని ఎంపీపీ హేమలత పేర్కొన్నారు. శనివారం మండల కేంద్రం ఆత్మకూరు బీసీ బాలుర వసతి గృహంలోని 109 మంది విద్యార్థులకు ఎంపీపీ బెడ్ షీట్లు పంపిణీ చేశారు. ఎంపీపీ మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల్లో అక్షరాస్యత శాతాన్ని పెంచేందుకు సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నాడు–నేడు ద్వారా ప్రభుత్వ పాఠశాలల రూపు రేఖలు మార్చేశారన్నారు. వసతి గృహాల్లో విద్యార్థులు చలికి ఇబ్బందులు పడకూడదన్న లక్ష్యంతోనే దుప్పట్లు పంపిణీ చేస్తున్నారన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ కన్వీనర్ లక్ష్మీ నరసింహులు, యూత్ కన్వీనర్ గూళి కొండారెడ్డి, బీసీ బాలుర వసతి గృహ వార్డెన్ నాగరాజు, నాయకులు విశ్వనాథ్ రెడ్డి, వన్నూరప్ప, అంజినప్ప, ఓబుల్ రెడ్డి, ఉపాధ్యాయులు షఫి, నారాయణ స్వామి పాల్గొన్నారు.

పోలింగ్ స్టేషన్ల పరిశీలన



కుంటిమద్దిలో పోలింగ్ బూత్‌ను పరిశీలిస్తున్న అధికారులు

రామగిరి: మండలంలోని పేరూరు, పేరూరు డ్యాం, నసనకోట, కొత్తగ్యాదికుంట, కుంటిమద్ది, గంతిమర్రి గ్రామాల్లోని పోలింగ్ స్టేషన్లను తహసీల్దార్ నారాయణస్వామి శనివారం పరిశీలించారు. కార్యక్రమంలో ఆర్ఐ నరసింహమూర్తి, సీనియర్ అసిస్టెంట్ జైప్రకాష్, వీఆర్‌ఓలు జగదీష్, నల్లప్ప, మంజునాథ్, ముత్యాలప్ప, రామాంజనేయులు పాల్గొన్నారు.

మృత్యువు వెంటాడింది!

- అదుపు తప్పి బొలెరో బోల్తా
- తీవ్ర గాయాలతో బయటపడిన డ్రైవర్
- డివైడర్‌పై కూర్చున్న క్షతగాత్రుడిని ఢీకొన్న మరోలారీ – అక్కడికక్కడే మృతి

ప్యాపిలి: రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన డ్రైవర్ ప్రాణాపాయం తప్పిందని డివైడర్‌పై కూర్చోగా.. మృత్యువు మరో లారీ రూపంలో కబళించింది. మండల పరిధిలోని పోతుదొడ్డి వద్ద జరిగిన ఘటన వివరాలు ఇలా.. అనంతపురం నగరానికి చెందిన వీరయ్య నాయక్ (45), శంకర్ నాయక్ సోదరులు. వీరయ్య నాయక్ ఏపీ02 డబ్ల్యూ 5286 బొలెరో వాహనానికి డ్రైవర్‌గా పని చేస్తుండగా, శంకర్‌నాయక్ క్లీనర్‌గా ఉంటున్నాడు. నూనె డబ్బాల లోడుతో శనివారం బొలెరో వాహనాన్ని కర్నూలు నుంచి అనంతపురం వైపు తీసుకెళ్తున్నారు. పోతుదొడ్డి వద్దకు రాగానే వాహనం అదుపు తప్పి బోల్తా పడింది. డ్రైవర్ వీరయ్య నాయక్ తీవ్రంగా గాయపడ్డాడు. స్థానికులు ఆయన్ను రోడ్డు పక్కన డివైడర్‌పై కూర్చోబెట్టారు. అయితే కొద్ది సేపటికే కర్నూలు నుంచి అనంతపురం వైపు వెళ్తున్న టీఎస్ 52 హెచ్ 3350 లారీ అదుపు తప్పి డివైడర్‌పై కూర్చున్న వీరయ్య నాయక్‌పైకి దూసుకెళ్లింది. దీంతో అతను అక్కడికక్కడే మృతి చెందాడు. గాయాలతో బయటపడిన డ్రైవర్‌ను లారీ రూపంలో వచ్చిన మృత్యువు కబళించడం స్థానికంగా విషాదాన్ని మిగిల్చింది. ప్యాపిలి పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

నగరపాలక సంస్థ ఆదాయానికి గండి

- మారుతీనగర్‌లో అనుమతిలేకుండా డీ కంప్రెషన్ పాయింట్
- పట్టించుకోని టౌన్ ప్లానింగ్ అధికారులు





టౌన్ ప్లానింగ్ అనుమతి లేకుండా మారుతీనగర్‌లో ఏర్పాటు చేసిన డీ కంప్రెషన్ పాయింట్

అనంతపురం కార్పొరేషన్: నగరపాలక సంస్థలోని టౌన్ ప్లానింగ్ అధికారుల బాధ్యతారాహిత్యం పెట్టుబడిదారులకు వరంగా మారుతోంది. నగరంలోని మారుతీనగర్‌లో రూ.50 లక్షలతో ఏర్పాటు చేసిన డీ కంప్రెషన్ పాయింట్ నిర్మాణానికి పరోక్షంగా సహకరించడం విమర్శలకు తావిస్తోంది. పట్టణ ప్రణాళిక కార్యదర్శి సదరు నిర్వాహకులకు నోటీసు కూడా ఇవ్వలేదు. కనీసం నగరపాలక సంస్థ టౌన్ ప్లానింగ్ విభాగం అధికారులకు ఈ విషయంపై తెలియదంటే క్షేత్రస్థాయిలో వీరు ఏమాత్రం పర్యటించి, అక్రమ నిర్మాణదారులపై ఎలాంటి చర్యలు తీసుకుంటున్నారో ఇట్టే అర్థమవుతుంది. నగరంలోని మారుతీనగర్‌లో డొమెస్టిక్ గ్యాస్ కనెక్షన్లు ఇవ్వడానికి ఓ కంపెనీ రూ.50 లక్షలతో 10 సెంట్ల స్థలంలో డీ కంప్రెషన్ పాయింట్ ఏర్పాటు చేసింది. కొన్ని నెలలుగా వీటి నిర్మాణం మారుతీనగర్‌లోని కేవశరెడ్డి స్కూల్ ఉండే వీధిలో జరిగింది. కానీ నగరపాలక సంస్థ టౌన్ ప్లానింగ్ అధికారులు అటువైపు తొంగి చూడలేదు. నిర్మాణం జరుగుతున్న విషయం తెలిసినా పట్టించుకోలేదన్న విమర్శలు ఉన్నాయి. పది సెంట్లలో ఓ కంపెనీ నిర్మాణం చేపట్టినా చూసీచూడనట్లు ఉన్నారు. వాస్తవంగా వీటి అనుమతులు కావాలంటే రూ.10 లక్షల నుంచి రూ.20 లక్షల వరకు నగరపాలక సంస్థకు డబ్బు చెల్లించాల్సి ఉంటుంది. ఇంత పెద్ద మొత్తంలో ప్రభుత్వ ఆదాయానికి గండికొడుతున్నా అధికారులు పట్టీపట్టనట్లు వ్యవహరిస్తున్నారు. ఇదే విషయమై టౌన్ ప్లానింగ్ ఆఫీసర్ (టీపీఓ) శిరీషాను అడగ్గా ఎలాంటి అనుమతి తీసుకోకుండా ఏర్పాటు చేస్తున్న విషయం వాస్తవమేనన్నారు. నిర్మాణాన్ని ఆపాలని ఆదేశాలు జారీ చేశామని, భవన నిర్మాణ అనుమతులు తీసుకున్నాకే డీ కంప్రెషన్ పాయింట్ ఏర్పాటు చేసుకోవాలని సూచించినట్లు చెప్పారు.

అందరం పార్టీ కోసం శ్రమిద్దాం



పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డిని కలిసిన తోపుదుర్తి చందు, నాయకులు

ఆత్మకూరు: వైఎస్సార్‌సీపీ అధికారంలోకొచ్చిన తర్వాత ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నాయకత్వంలో ప్రజలకోసం ప్రభుత్వం అనేక సంక్షేమ పథకాలు ప్రవేశపెట్టింది.. ఇవన్నీ ప్రజలకు వివరించే సమయమొచ్చింది.. అందరం పార్టీ కోసం శ్రమిద్దామని వైఎస్సార్‌సీపీ నాయకులు, ప్రజాప్రతినిధులకు మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి తెలియజేశారు. శనివారం కల్యాణదుర్గం నుంచి అనంతపురం వెళ్తున్న మంత్రి కాన్వాయ్ ఆత్మకూరు బైపాస్ వద్ద ఆగింది. ఈసమయంలో వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ సీనియర్ నాయకుడు తోపుదుర్తి చందు, స్థానిక నాయకులను మంత్రి పలకరించారు. ఈసందర్భంగా మండల నాయకులు, ప్రజాప్రతినిధులను చందు పరిచయం చేశారు. అనంతరం పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డికి తోపుదుర్తి చందు శాలుకా కప్పి, సత్కరించారు. అనంతరం ఆత్మీయంగా పలకరించారు. ఈ కార్యక్రమంలో ప్రజా ప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

బస్సుయాత్రను జయప్రదం చేద్దాం

ఆత్మకూరు: నియోజకవర్గ కేంద్రంలో ఈ నెల 4న జరగనున్న సామాజిక సాధికార బస్సుయాత్రను జయప్రదం చేద్దామని వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకుడు తోపుదుర్తి చంద్రశేఖర్‌రెడ్డి (చందు) తెలిపారు. శనివారం మండలంలోని ముట్టాల, గొర్రిదిండ్ల గ్రామాల్లో వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలతో సమావేశం ఏర్పాటు చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో పార్టీలకతీతంగా జరిగిన అభివృద్ధి, లబ్ధిదారులకు అందించిన సంక్షేమ పథకాలపై ప్రజలకు వివరించాలన్నారు. గత డీటీపీ ప్రభుత్వంలో టీడీపీ నాయకులకు ప్రజలకు చెప్పుకోవడానికి ఏం అభివృద్ధి లేదని, వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో ఎన్నడూ లేని విధంగా పథకాలతో ప్రజలు లబ్ధి పొందారని, దీని వల్లే వైఎస్సార్‌సీపీ నాయకులు, ప్రజా ప్రతినిధులు ప్రజల్లోకి ధైర్యంగా ప్రతి ఇంటికీ వెళ్తున్నారన్నారు. పది ఎకరాలకే పరిమితమైన పరిటాల కుటుంబం నేడు రూ.కోట్లకు పడగలెత్తిందన్నారు. కార్యక్రమంలో జిల్లా అధికార ప్రతినిధి చంద్రశేఖర్ రెడ్డి, ఎంపీపీ హేమలత, బీసీ సెల్ నియోజకవర్గ అధ్యక్షుడు బాలపోతన్న, కన్వీనర్ లక్ష్మీనరసింహులు, యూత్ కన్వీనర్ కొండారెడ్డి, జేసీఎస్ మండల ఇన్‌చార్జ్ వడ్డుపల్లి నరసింహారెడ్డి, మండల ఎలక్షన్ ఇన్‌చార్జ్ గోపాల్‌రెడ్డి, మాజీ జెడ్పీటీసీ బంధూక మధు, నాయకులు వాసుదేవరెడ్డి, ముత్యాలరెడ్డి, ఫణిరెడ్డి, అతిక్‌రెడ్డి, జయరెడ్డి, మల్లేష్, ఓబయ్య, పోతన్న, గోవింద్, హనుమంతు నాయక్ , ఎర్రిస్వామి తదితరులు పాల్గొన్నారు.

భవిత కేంద్రం మంజూరు చేయండి



ఐఈ కోఆర్డినేటర్ షమాకు వినతిపత్రం అందిస్తున్న దృశ్యం

అనంతపురం ఎడ్యుకేషన్: అనంతపురం రూరల్ మండలానికి ప్రత్యేకంగా భవిత కేంద్రం ఏర్పాటు చేయాలని స్థానిక ప్రత్యేక అవసరాలు గల పిల్లల తల్లిదండ్రులు కోరారు. శనివారం సమగ్రశిక్ష కార్యాలయానికి పలువురు ప్రత్యేక అవసరాలు గల పిల్లల తల్లిదండ్రులు వచ్చి, ఏపీసీ అందుబాటులో లేకపోవడంతో ఐఈ కోఆర్డినేటర్ షమాను కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ప్రత్యేక పిల్లల తల్లిదండ్రులు నజీర్, మంజునాథ్,అజయ్‌కుమార్, పెద్దక్క, విశ్వనాథన్, మనోజ్‌కుమార్ తదితరులు మాట్లాడుతూ అనంతపురం అర్బన్, రూరల్ మండలాల్లో దాదాపు 900 మందికి పైగా ప్రత్యేక పిల్లలు ఉన్నారన్నారు. వీరంతా ఉన్న ఒక్క సెంటర్‌కు పోలేక, పోయినా అక్కడ వసతి లేక ఇబ్బందులు పడుతున్నామన్నారు. ప్రభుత్వ మేమో ప్రత్యకపిల్లల కోసం భవిత కేంద్రాలు ఏర్పాటు చేసి అన్ని వతసులు కల్పిస్తోందన్నారు. ఈ సదుపాయాలు తమ పిల్లలు అందుకోలేకపోతున్నారని వాపోయారు. రూరల్ మండలానికి ప్రత్యేకంగా భవిత కేంద్రం మంజూరు చేస్తే చాలామంది ప్రత్యేక పిల్లలకు ఉపయోగకరంగా ఉంటుందని వారు కోరారు.

నేడు కార్తీక వనమహోత్సవం



సమావేశంలో మాట్లాడుతున్న బలిజలు

అనంతపురం టవర్‌క్లాక్: రాయలసీమ బలిజ మహా సంఘం ఆధ్వర్యంలో ఆదివారం నిర్వహించనున్న కార్తీక వనమహోత్సవాన్ని విజయవంతం చేయాలని రాయలసీమ బలిజ మహా సంఘం జిల్లా అధ్యక్షుడు వెంకటేష్, మహిళా అధ్యక్షురాలు పద్మజ తెలిపారు. శనివారం స్థానిక బాలాజీ కల్యాణ మంటపంలో విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాయలసీమ బలిజ మహా సంఘం ఆధ్వర్యంలో సోమలదొడ్డిలోని తడకలేరు అశ్వత్థ నారాయణ వనంలో నిర్వహించనున్న కార్తీక వనభోజనాలకు ఏర్పాట్లు పూర్తి చేశామన్నారు. జిల్లా వ్యాప్తంగా తరలివచ్చే బలిజ కుటుంబ సభ్యులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా వసతులు ఏర్పాటు చేశామన్నారు. సాంస్కృతిక, ఆధ్యాత్మిక కార్యక్రమాలతో పాటు పెద్ద ఎత్తున తరలివచ్చే బలిజ బంధువులకు పార్కింగ్, నీటి వసతి, దీపాలు వెలిగించేందుకు అవసరమైన ప్రమిదలు ఏర్పాటు చేశామన్నారు. వేలాదిమందిగా తరలివస్తున్న మహిళలు, చిన్నారులు, వృద్ధులు, వికలాంగులు ఇబ్బంది పడకుండా వారికి ప్రత్యేకంగా ఆలయ ప్రాంగణం వద్ద దారి ఏర్పాటు చేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో పసుపులేటి భారతి, గౌరి, తిలోత్తమ, నీరజ, దేవి, పద్మ, ఈశ్వరమ్మ, దీప తదితరులు పాల్గొన్నారు.

ఈవీఎంల పని తీరుపై అవగాహన

శింగనమల: తహసీల్దార్ కార్యాలయంలో శనివారం ఈవీఎంల పనితీరుపై అధికారులు ప్రజలకు అవగాహన కల్పించారు. తహసీల్దార్ ఈశ్వరమ్మ మాట్లాడుతూ తహసీల్దార్ కార్యాలయంలో ఎలక్ట్రానిక్ ఓటింగ్ యంత్రాల అవగాహన కేంద్రాన్ని ప్రారంభించామన్నారు. ఓటర్లు ఈవీఎంల పనితీరు తెలుసుకోవచ్చన్నారు. కార్యక్రమంలో ఎన్నికల డిప్యూటీ తహసీల్దార్ రామకృష్ణ, సిబ్బంది పాల్గొన్నారు.

తోపుదుర్తి ట్రస్టు సహకారంతో రైతులకు బోర్లు



ముక్తాపురంలో బోరు తవ్వకాన్ని పరిశీలిస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు

కనగానపల్లి: మండలంలోని ముక్తాపురంలో తోపుదుర్తి ట్రస్టు సహకారంతో రైతులకు ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి ఉచితంగా బోర్లు వేయిస్తున్నారని వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ అమరనాథరెడ్డి తెలిపారు. శనివారం స్థానిక వైఎస్సార్‌సీపీ నాయకులతో కలిసి ఆయన ఉచిత బోర్ల కార్యక్రమాన్ని పరిశీలించారు. రైతు కిష్టయ్య పొలంలో వేసిన బోరుబావిలో నీరు పుష్కలంగా పడటంపై వారు హర్షం వ్యక్తం చేశారు. తోపుదుర్తి ట్రస్టు ద్వారా మండలంలో ఇప్పటి వరకు సుమారు 200 బోర్లు వేయించామని, వాటిలో చాలా వరకు రైతులకు పుష్కలంగా నీరు పడిందని నాయకులు తెలిపారు. వైఎస్సార్ జలకళ కింద అర్హత పొంది ప్రభుత్వం ద్వారా ఇంకా బోర్లు వేయించుకోని రైతులకు ఎమ్మెల్యే ప్రకాష్‌రెడ్డి తన సొంత నిధులు వెచ్చించి, బోర్లు వేయిస్తున్నారన్నారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ నరసింహారెడ్డి, స్థానిక వైఎస్సార్‌సీపీ నాయకులు రమణారెడ్డి, వెంకటనారాయణరెడ్డి, సర్పంచ్ నారాయణ, ఓబిలేసు, వెంకటరాముడు, రైతులు పాల్గొన్నారు.

మైక్రో బయాలజీ పరీక్షలు అవసరం

- సూపరింటెండెంట్ డాక్టర్ కేఎస్ఎస్, ప్రిన్సిపాల్ మాణిక్యరావు



సూపరింటెండెంట్, ప్రిన్సిపాల్‌తో మైక్రో బయాలజీ విభాగం వైద్యులు, సిబ్బంది

అనంతపురం మెడికల్: వివిధ రకాల జబ్బులతో బాధపడుతున్న వారికి సరైన చికిత్స అందించేందుకు మైక్రోబయాలజీ కల్చర్ పరీక్షలు ఎంతో కీలకమని జీజీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ కేఎస్ఎస్ వెంకటేశ్వరరావు, వైద్య కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ మాణిక్యరావు పేర్కొన్నారు. శనివారం సూపర్ స్పెషాలిటీలో మైక్రో బయాలజీ కల్చర్ పరీక్షలు ప్రారంభోత్సవ కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా సూపరింటెండెంట్, ప్రిన్సిపాల్ మాట్లాడుతూ మైక్రోబయాలజిస్టులు ఇచ్చిన నివేదికల ఆధారంగా రోగికి అవసరమైన మందు (యాంటీబయోటిక్) వైద్యులు సిఫార్సు చేస్తారన్నారు. తద్వారా సకాలంలో రోగం నయమవుతుందన్నారు. బ్యాక్టీరియా, ఫంగస్ కల్చర్ పరీక్షలు, ఆపరేషన్ థియేటర్స్ స్వాబ్స్ కల్చర్ పరీక్షలు సూపర్ స్పెషాలిటీలోనూ చేస్తున్నట్లు తెలిపారు. త్వరలో హెచ్ఐవీ పరీక్షలు నిర్వహించేలా చర్యలు తీసుకోబోతున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో డిప్యూటీ సూపరింటెండెంట్ డాక్టర్ సుబ్రమణ్యం, సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రి అడ్మినిస్ట్రేటివ్ అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ సౌజన్య కుమార్, వైద్యులు డాక్టర్ సుభాష్ చంద్రబోస్, డాక్టర్ హైమావతి, డాక్టర్ సరోజ, డాక్టర్ బసిరెడ్డి ప్రవీణ, డాక్టర్ శైలజ, డాక్టర్ ఉమాదేవి, డాక్టర్ ఆదిరెడ్డి పరదేశీ నాయుడు, టెక్నీషియన్లు విజయలక్ష్మి, ఉష, భార్గవ్, గ్రేడ్- 1 నర్సింగ్ సూపరింటెండెంట్ మంజు, గ్రేడ్-2 నర్సింగ్ సూపరింటెండెంట్ రజిని, తదితరులు పాల్గొన్నారు.

ప్రతిభా నైపుణ్యాలు అవసరం



టెక్ తత్వ 2కే 23 పోస్టరును ఆవిష్కరిస్తున్న కళాశాల యాజమాన్యం

రాప్తాడు: ఇంజినీరింగ్ విద్యార్థులకు ప్రతిభా నైపుణ్యాలు, భవిష్యత్తు కార్యాచరణ ప్రణాళిక అవసరమని ఎస్వీఐటీ కళాశాల కళాశాల కరస్పాండెంట్ వీబీఆర్ శర్మ విద్యార్థులకు సూచించారు. మండలంలోని హంపాపురం సమీపంలోని శ్రీ వెంకటేశ్వర ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ (ఎస్వీఐటీ) ఇంజినీరింగ్ కళాశాలలో డెవాప్స్ అనే అంశంపై మూడు రోజుల పాటు నిర్వహించిన టెక్ తత్వ 2కే 23 సాంకేతిక సదస్సు శనివారంతో ముగిసింది. కళాశాల కరస్పాండెంట్ వీబీఆర్ శర్మ మాట్లాడుతూ విద్యార్థులు శాస్త్రీయ దృక్పథం అలవర్చుకోవాలన్నారు. అనంతరం టెక్ తత్వ 2కే23 పోస్టర్‌ను ఆవిష్కరించారు. కార్యక్రమంలో కళాశాల చైర్మన్ కృష్ణారెడ్డి, వైస్ చైర్మన్ వెన్నపూస రవీంద్రా రెడ్డి, ఎండీ వెన్నపూస రమాకాంత్ రెడ్డి, ప్రిన్సిపాల్ టి.సూర్య శేఖర్ రెడ్డి, సీఈఓ ఆనంద్ కుమార్, సీఎస్ఈ విభాగపతి రంగా స్వామి, సీఎస్‌డీ విభాగాపతి షరీఫ్, సీఎస్ఎం విభాగపతి బాలాజీ, ఉపాధ్యాయులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

5న కుల గణనపై సమీక్ష

కనగానపల్లి: ప్రభుత్వం చేపట్టిన కులగణన కార్యక్రమంపై ఈ నెల 5న స్థానిక ప్రజాప్రతినిధులు, అధికారులతో సమీక్ష నిర్వహిస్తున్నట్లు ఎంపీడీఓ అలివేలమ్మ శనివారం ఓ ప్రకటనలో తెలిపారు. స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో జరిగే ఈ సమావేశానికి ఎంపీపీ, జెడ్పీటీసీ, ఎంపీటీసీలు, సర్పంచులు, కుల సంఘాల నాయకులు, రెవెన్యూ, పంచాయతీ అధికారులు హాజరుకావాలన్నారు.

దౌర్జన్యాన్ని అడ్డుకొని బాధితులకు న్యాయం

అనంతపురం క్రైం: అనంతపురం నాల్గో పట్టణ పోలీసు స్టేషన్ పరిధిలోని సర్వేనంబర్ 368లో 73 మంది ప్లాట్ల యజమానులకు పోలీసులు న్యాయం చేశారు. వీరు కొనుగోలు చేసిన స్థలాల్లోకి ప్రసన్నాయపల్లికి చెందిన రెడ్డప్ప, గోపాల్‌రెడ్డి యజమానులను రానివ్వకుండా అడ్డుపడుతుండగా బాధితులందరూ జిల్లా పోలీస్ స్పందనలో విన్నవించారు. దీనిపై ఆరాతీసిన ఎస్పీ...పబ్లిక్ ప్రాసిక్యూటర్ హరినాథ్‌రెడ్డితో లీగల్ ఒపీనియన్ తీసుకున్నారు. సదరు స్థలం 73 మందికి చెందినదేనని తేలడంతో నగర డీఎస్పీ ప్రసాద్ రెడ్డి, సీఐ ప్రతాప్‌రెడ్డి కలిసి ఆ స్థలాన్ని క్లీన్ చేసుకోవచ్చని బాధితులకు చెప్పి పంపారు. కాగా స్థలంలోకి వెళ్లిన యజమానులను ప్రసన్నాయపల్లికి చెందిన రెడ్డప్ప, గోపాల్‌రెడ్డి అడ్డగించే ప్రయత్నం చేస్తుండగా బాధితులు డీఎస్పీకి ఫోన్‌లో సమాచారం ఇచ్చారు. దీంతో ఘటనా స్థలానికి వెళ్లి ఆక్రమణ దారులను అడ్డుకొని, స్థలాన్ని యజమానులకు స్వాధీనం చేయించారు.

యువకుడికి తీవ్ర గాయాలు

గుత్తి రూరల్: వన్నేదొడ్డి గ్రామ శివారులో శనివారం బైక్‌పై నుంచి పడి ఓ యువకుడికి తీవ్రగాయాలయ్యాయి. పోలీసులు తెలిపిన వివరాలు.. పెద్దవడుగూరు మండలం క్రిష్టపాడుకు చెందిన మనోజ్ గుత్తి మండలం కరిడికొండకు పని నిమిత్తం వెళ్లాడు. అక్కడ పని ముగించుకొని తిరిగి క్రిష్టపాడుకు వెళ్తుండగా వన్నేదొడ్డిశివారులో 44వ నంబర్ జాతీయ రహదారిపై బైక్ అదుపుతప్పి కిందపడ్డాడు. తీవ్రంగా గాయపడిన మనోజ్‌ను గుత్తి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అనంతరం వైద్యుల సూచన మేరకు అనంతపురం తీసుకెళ్లారు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

వాహనాల వేలం రేపు

అనంతపురం క్రైం: అనంతపురం స్పెషల్ ఎన్ఫోర్స్‌మెంట్ బ్యూరో స్టేషన్ పరిధిలోని వివిధ ప్రొహిబిషన్, ఎక్సైజ్ నేరాల్లో పట్టుబడిన వాహనాలను ఈనెల 4న వేలం వేయనున్నట్లు సీఐ రవిచంద్ర తెలిపారు. ఉదయం 11 గంటలకు సెబ్ పోలీసు స్టేషన్ ఆవరణలో బహిరంగ వేలం వేస్తున్నట్లు తెలిపారు. వేలంలో పాల్గొనేందుకు ఆసక్తి ఉన్న వారు రూ. 3 వేల ధరావత్తు చెల్లించాలని తెలిపారు.

నేడు బాలోత్సవ్ సన్నాహక కమిటీ సమావేశం

అనంతపురం కల్చరల్: స్థానిక ఎన్జీఓ హోంలో బాలోత్సవ్ సన్నాహక కమిటీ సమావేశం ఆదివారం సాయంత్రం 4.30 గంటలకు జరగనుందని కమిటీ ప్రతినిధి సావిత్రి ఓ ప్రకటనలో తెలిపారు. ఈ ఏడాది నిర్వహించబోవు పిల్లల ప్రేమికుల బాలోత్సవం నిర్వహణకు సంబంధించి సమావేశం ఉంటుందని తెలిపారు. విద్యావంతులు, కళాకారులు సమావేశంలో భాగస్వాములు కావాలని కోరారు.

సివిల్ సర్వీసెస్‌పై దృష్టి సారించాలి

అనంతపురం: అత్యున్నత స్థాయి కొలువు అయిన సివిల్ సర్వీసెస్‌పై విద్యార్థులు దృష్టి సారించాలని జేఎన్‌టీయూ అనంతపురం వీసీ ప్రొఫెసర్ జింకా రంగజనార్దన సూచించారు. జేఎన్‌టీయూ అనంతపురంలో ఏపీ ప్రభుత్వం ప్రాంతీయ ఉపాధికల్పన కార్యాలయం ఆధ్వర్యంలో విద్యార్థులకు ' కెరీర్ కాన్ఫరెన్స్ ఆన్ ప్రిపరేషన్ ఫర్ కాంపిటేటివ్ ఎగ్జామినేషన్స్' అనే అంశంపై ఒక్క రోజు సదస్సు నిర్వహించారు. కార్యక్రమానికి వీసీ ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. చిన్నస్థాయి కొలువులకు వెళ్లకుండా డిగ్రీకి తగ్గట్టు ఉద్యోగాలు సాధించాలనే లక్ష్యంతో సన్నద్ధం కావాలన్నారు. కార్యక్రమంలో రెక్టార్ ప్రొఫెసర్ ఎం.విజయకుమార్, రిజిస్ట్రార్ ప్రొఫెసర్ సి. శశిధర్, రీజనల్ ఎంప్లాయిమెంట్ ఆఫీసర్, వర్సిటీ పూర్వ విద్యార్థి పి. ప్రసాద్, కళాశాల ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ ఎస్వీ సత్యనారాయణ, వైస్ ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ ఈ. అరుణకాంతి, ఫారిన్ అఫైర్స్ డీన్ ప్రొఫెసర్ పి.సుజాత, జిల్లా ఉపాధి కల్పన అధికారి ఎ. కళ్యాణి తదితరులు పాల్గొన్నారు.

ఓటరుగా నమోదు చేసుకోండి

బుక్కరాయసముద్రం: అర్హత ఉన్న ఉన్న ప్రతి ఒక్కరూ ఓటర్‌గా నమోదు చేసుకోవాలని నియోజకవర్గ ఎన్నికల అధికారిణి సుధారాణి పేర్కొన్నారు. శనివారం మండల కేంద్రంలో ఓటరు నమోదు కార్యక్రమాన్ని పరిశీలించారు. ముందుగా మండలంలో ఎంత మంది బీఎల్‌ఓలు ఉన్నారని ఎన్ని పంచాయతీలు ఉన్నాయని అడిగి తెలుసుకున్నారు. అర్హులైన ప్రతి ఒక్కరికీ ఓటు హక్కు కల్పించాలన్నారు. తహసీల్దార్ రమాదేవి, వీఆర్‌ఓలు ఓబిలేసు, అయ్యప్ప పాల్గొన్నారు.

మున్సిపల్ కార్మిక సంఘం జిల్లా కమిటీ ఎంపిక



చిరంజీవి



రాజేష్‌గౌడ్

అనంతపురం అర్బన్: ఏపీ మున్సిపల్ కార్మిక సంఘం జిల్లా నూతన కమిటీని ఎంపిక చేశారు. ఈనెల ఒకటో తేదీన జరిగిన సంఘం సర్వసభ్య సమావేశంలో నూతన కమిటీని రాష్ట్ర కార్యదర్శి సుబ్బరాయుడు సమక్షంలో ఎంపిక చేసినట్లు సంఘం జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు తెలిపారు.

నూతన కమిటీ ఇదే : మున్సిపల్ కార్మిక సంఘం జిల్లా గౌరవాధ్యక్షుడిగా రాజారెడ్డి, అధ్యక్షుడిగా చిరంజీవి, ప్రధాన కార్యదర్శిగా రాజేష్‌గౌడ్‌ను ఎంపిక చేశారు. అదేవిధంగా కార్యనిర్వాహక అధ్యక్షుడిగా నరసయ్య, ఉపాధ్యక్షుడిగా కొండయ్య, కార్యదర్శులుగా నాగరాజు, రఫి, కోశాధికారిగా వేణుగోపాల్‌తో పాటు 25 మంది జిల్లా సమితి సభ్యులను ఎంపిక చేశారు.

ఏబీవీపీ రాష్ట్ర కార్యదర్శిగా యచంద్ర



యచంద్ర

అనంతపురం: జేఎన్‌టీయూ అనంతపురం పీహెచ్‌డీ విద్యార్థి ఎస్.యచంద్ర రెండో దఫా ఏబీవీపీ రాష్ట్ర కార్యదర్శిగా నియమితులయ్యారు. శ్రీకాళహస్తికి చెందిన యచంద్ర జేఎన్‌టీయూ అనంతపురంలోనే ఎంటెక్ పూర్తిచేశారు. గతంలో అనంతపురం జిల్లా టెక్నికల్ సెల్ కన్వీనర్‌గా, రాష్ట్ర కార్యవర్గంలోనూ పలు హోదాల్లో పనిచేశారు. 2019 ఏబీవీపీ ప్రతిష్టాత్మకంగా నిర్వహించిన ఈశాన్య భారతదేశ విద్యా అధ్యయన యాత్ర (ఎస్ఈఐఎల్) ఏపీ ప్రతినిధిగా పాల్గొని, అక్కడ విద్యాస్థితిగతులను అధ్యయనం చేశారు. తాజాగా ఏబీవీపీ రాష్ట్ర కార్యదర్శిగా రెండో దఫా నియామకం అయ్యారు. ఏబీవీపీ రాష్ట్ర అధ్యక్షుడిగా శ్రీకృష్ణదేవరాయ విశ్వవిద్యాలయం బయోటెక్నాలజీ ప్రొఫెసర్ డాక్టర్ డి. మురళీధర్‌రావును రెండో దఫా నియామకం చేశారు.

నేడు రాయలసీమ ప్రాంతీయ సదస్సు

అనంతపురం టవర్‌క్లాక్: స్థానిక ఉపాధ్యాయ భవనంలో రాయలసీమ ప్రాంతీయ సదస్సు ఉంటుందని అఖిల భారత గిరిజన ఉద్యోగుల సంఘం ఉపాధ్యక్షులు రవీంద్ర నాయక్ శనివారం ఓ ప్రకటనలో తెలిపారు. ఈ సదస్సుకు గిరిజన ఉద్యోగ, ఉపాధ్యాయ, ప్రజా సంఘాల నాయకులు హాజరై జయప్రదం చేయాలని కోరారు.